సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 16 । జూన్ । 2024



దొంగల బీభత్సం

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం, ఆలేరు పట్టణంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు.

- 8లో



వైభవంగా ఎదుర్కోలు

దర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

- 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 35°/ 26°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

18,19,20 తేదీల్లో స్థాయీ సంఘాల సమావేశాలు

భువనగిరిటౌన్ : జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 18,19,20 తేదీల్లో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం ఒకటవ, మధ్యాహ్నం రెండవ, నాలుగో స్థాయీ, 19న ఉదయం ఐదవ, మూడో స్థాయీ సంఘాల సమావేశాలు ఉంటాయన్నారు. 20న ఉదయం ఆరవ స్థాయీ సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు



భట్టి విక్రమార్కకు యాదాద్రీశుడి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ప్రభుత్వ విప్, ఈఓ

యాదగిరిగుట్ట : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, యాదాద్రి దేవస్థానం ఈవో భాస్కర్‌రావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. యాదాద్రీశుడి లడ్డూ ప్రసాదం అందజేశారు. అలాగే నృసింహుడి చిత్రపటాన్ని బహూకరించారు.

'నీట్' పేపర్ లీకేజీపై విచారణ చేయించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

భువనగిరి టౌన్ : నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలో జరిగిన డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీపై కేంద్రం స్పందించకుండా గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థుల స్కోర్ కార్డులు రద్దు చేసి.. వారికి మళ్లీ పరీక్ష నిర్వహించడం అంటే అవకతవకలను కప్పిపుచ్చడమేనన్నారు. దీని వల్ల ర్యాంకులు తారుమారయ్యే అవకాశం ఉందన్నారు. పరీక్ష కంటే ముందు రోజు పాట్నాలో 13 మందిని పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారని, హర్యానాలో ఒకే సీరియల్ నంబర్ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయని, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా లీకేజీ అంశాలు వెలుగుచూశాయన్నారు. ముమ్మందు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గ నవీన్, గద్దం వెంకటేష్, ఉపాధ్యక్షులు పల్లె మధుకృష్ణ, కవుడే సురేష్, దయ్యాల మల్లేష్, చెన్న రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు బొనగిరి గణేష్, గద్దం లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఆయనకు కుడివైపున చిన్న కుమారుడు, సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఎడమవైపున పెద్ద కుమారుడు, నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి

- క్రమశిక్షణకు నిలువెత్తు నిదర్శనం మా నాన్న
- మా ఎదుగుదలలో అడుగడుగునా ఆయన ప్రభావం
- నైతికత, విలువలు నేర్పిన రాజకీయ గురువు నాన్నే..
- ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే నాన్న నైజం మాకు ఆదర్శం
- మాజీ మంత్రి జానారెడ్డి తనయులు రఘువీర్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి

నేడు ఫాదర్స్ డే సందర్భంగా 'సాక్షి'తో మనోగతం పంచుకున్న ఎంపీ, ఎమ్మెల్యే

నాన్నే.. స్ఫూర్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో పెద్దాయనగా, క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయులు రఘువీర్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి ఇటీవల ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఎన్నికై తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. జానారెడ్డి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అనేక సంవత్సరాలపాటు తండ్రిచాటు బిడ్డలుగానే ఉన్న ఆ ఇద్దరు.. అనూహ్యంగా రాజకీయ అరంగేట్రం చేశారు. తండ్రి అడుగుజాడల్లో నడిచిన అన్నదమ్ములు ఇద్దరూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. చిన్నప్పటి నుంచి వారి పెంపకం, బాగోగులు చూడటం మొదలుకొని రాజకీయంగా ఎదిగే వరకు వారి వెన్నంటి జానారెడ్డి ఉన్నారు. ఎప్పటికప్పుడు వారిని కనిపెడుతూ, జాగ్రత్తలు చెబుతూ జీవిత, రాజకీయ పాఠాలు చెప్పిన జానారెడ్డి గురించి ఫాదర్స్ డే సందర్భంగా ఆయన తనయులు 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే..

క్రమశిక్షణకు మారు పేరు నాన్న
- కుందూరు రఘువీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ

క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగిన వ్యక్తులుగా ఎలా మసలుకోవాలనే విషయాలను నాన్న చిన్నతనం నుంచే చెప్పేవారు. రాజకీయ నాయకులు ఎలా ఉండాలి.. ఎలా సేవ చేయాలి? మన దగ్గరికి ఏదైనా పని అని వస్తే ఆ పనిని ఎలా చేసి పెట్టాలి.. వారికి ఎలా ఆసరాగా నిలవాలి అనే విషయాలను పదేపదే చెప్పేవారు. అనేక సందర్భాల్లో చాలా మంది నాన్న దగ్గరికి వచ్చి వారి బాధలు చెబుతున్నప్పుడు నాన్న స్పందించిన తీరు నాకు ఇప్పటికీ గుర్తుంది. మన సాయం కోరి వచ్చిన వారికి సహాయం చేయడంలో ఉన్న తృప్తిని మించిన ఆనందం మరొకటి లేదని తరచూ అంటుండేవారు.



తల్లిదండ్రులతో జయవీర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి (ఫైల్)

నాన్నే మాకు రాజకీయ గురువు. నాన్న నుంచి నేర్చుకున్న రాజకీయ ఓనమాలే నేడు నేను ఒక రాజకీయ నాయకుడిగా నిలదొక్కుకోవడానికి ప్రజా నాయకుడిగా మారడానికి దోహదపడుతున్నాయి. నా చిన్నతనం నుంచి నన్ను చాలా గారాబంగా చూసుకున్నా.. చదువు, క్రమశిక్షణ విషయంలో మాత్రం చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు. నాన్నతో మాట్లాడితే 40 ఏళ్ల అనుభవం, ఆయన చూసిన సమస్యలు, తీర్చిన విధానం, జరుగుతున్న రాజకీయ పరిణామాలు అన్నింటినీ పూసగుచ్చినట్లు వివరించేవారు. నేటితరం రాజకీయాల్లోకి రావాలనుకుంటే ప్రజలతో మమేకమవ్వాలని, ప్రజల తీర్పే కొలమానంగా ఉండాలని చెబుతారు. అలాంటి గొప్ప నాయకుడి కుమారుడిని అయినందుకు నేను గర్వంగా ఫీలవుతున్నాను.



నైతిక విలువలు నేర్పింది నాన్నే
- కుందూరు జయవీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే

నాన్న రాజకీయాల్లో ఎంత విలువలతో ఉన్నారో అంతే విలువలతో మమ్మల్ని పెంచారు. నేను పుట్టిన మూడు నెలలకే నాన్న మంత్రి అయ్యారు. ఆయన ఎంత బిజీగా ఉన్నా, ఎక్కువ సమయం కేటాయించలేకపోయినా, ఎప్పటికప్పుడు మా బాగోగులు చూసుకునేవారు. మేం ఏం చేస్తున్నాం అనేది దగ్గర ఉండి చూసుకునే వారు. మేం ఎలా ఉన్నాం. ఎవరితో ఎలా వ్యవహరించాలనేది ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే లక్షణాన్ని మాకు ఆయనే నేర్పించారు. ఎలాంటి గర్వం లేకుండా ఆయన ఎలా ఉంటారో మేం కూడా అలాగే ఉండేలా చేశారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదనే విషయాన్ని మాకు నూరిపోశారు. ఆయన పదవులు ఉన్నప్పుడు అహంతో వ్యవహరించలేదు. పదవులు లేనప్పుడు కుంగిపోలేదు. అలాగే మేము ఎప్పుడూ ఒకేలా ఉండాలని మాకు బోధించారు. ఆయన వ్యవహరించే తీరు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎదిగాం. ఆయన ఆలోచనలను ఆకళింపు చేసుకొని వ్యవహరిస్తున్నాం. నాన్న మర్యాదకు భంగం వాటిల్లకుండా, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుతున్నాం. జీవితంలో ఎవరినీ నొప్పించకుండా, న్యాయం చేయాలన్న నాన్న ఫిలాసఫీని ఒంటబట్టించుకున్నాం. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మేం రాజకీయాల్లోకి రావాలనుకున్నప్పుడు నాన్న అందుకు సపోర్టు చేసి, మేం ఎదిగేలా కృషి చేశారు.

నాన్న చూపిన దారిలో.. 8లో

యాదాద్రి కొండ దిగువన నిర్మాణంలో ఉన్న నిత్యాన్నదాన సత్ర భవనం



నిత్యం వెయ్యి మందికే!

యాదాద్రిలో భక్తులకు పరిమిత సంఖ్యలో అన్నప్రసాదం అందజేత

- మూడేళ్లయినా పూర్తికాని నిత్యాన్నదాన సత్ర భవనం
- అందుబాటులోకి వస్తే రోజూ ఐదు వేల మందికి ప్రయోజనం
- తాత్కాలికంగా దీక్షాపరుల మండపం వినియోగం

యాదగిరిగుట్ట : యాదాద్రి ప్రధానాలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండ దిగువన చేపట్టిన నిత్యాన్నదాన సత్ర భవనం పనులు తుది దశలో నిలిచిపోయాయి. పనులు అసంపూర్తిగా ఉండగానే గత జూన్‌లో భవనాన్ని ప్రారంభించినప్పటికీ.. అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం చూస్తున్నారు. భవనం వినియోగంలోకి వస్తే నిత్యం ఐదు వేల మంది వరకు అన్నప్రసాదం అందజేయడానికి వీలు కలగనుంది. ప్రస్తుతం దీక్షాపరుల మండపంలో రోజూ కేవలం వెయ్యి మందికి మాత్రమే అన్నప్రసాదం అందజేస్తున్నారు.

తిరుమల తరహాలో నిర్మాణం

యాదాద్రి పునర్నిర్మాణం తర్వాత భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నిత్యం వేలాది మంది దైవ దర్శనం చేసుకుని వెళ్తున్నారు. రోజూ 10 వేలకు పైగా మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అగుణంగా తిరుమల తిరుపతి తరహాలో నిత్యాన్నదాన సత్ర భవన నిర్మాణానికి 2021 మే నెలలో శ్రీకారం చుట్టారు. యాదాద్రి కొండకు దిగువన రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. పనులు పూర్తి కాకుండానే గత ఏడాది జూన్ 6న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆధ్యాత్మిక దినోత్సవం పేరిట భవనాన్ని ప్రారంభించారు. కానీ, భవనాన్ని ఇప్పటి వరకు అందుబాటులోకి తీసుకురావడం లేదు. లక్ష్మీ పుష్కరిణి పక్కన ఉన్న దీక్షపరుల మండపాన్ని తాత్కాలికంగా అన్నప్రసాదం పంపిణీ కోసం వినియోగిస్తున్నారు.

వైటీడీఏ, వేగేశ్న సంస్థ ఆధ్వర్యంలో పనులు

నిత్యాన్నదాన సత్రం భవనాన్ని రూ.22 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. ఇందులో పిల్లర్ల పనులను రూ.8 కోట్లతో వైటీడీఏ చేపట్టగా, మిగిలిన రూ.12 కోట్ల పనులను వేగేశ్న సంస్థకు అప్పగించారు. ప్రధానాలయం ఉద్ఘాటన నాటికే నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనులు ప్రారంభించారు. ఆలయ ఉద్ఘాటన జరిగి రెండేళ్లు గడిచినా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. 85శాతం పనులు పూర్తి కాగా.. ఇంకా 15 శాతం పనులు మిగిలి ఉన్నాయి. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.2 కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆధ్యాత్మిక ఉట్టిపడేలా..

ఆధునిక హంగులు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో అన్నప్రసాదం పంపిణీకి రెండు హాళ్లతో పాటు కిచెన్, వెయిటింగ్ హాల్, వీఐపీ సెక్షన్, వాష్ రూమ్స్ వంటివి రానున్నాయి. ఒక్కో హాల్‌లో ఏకకాలంలో వెయ్యి మంది చొప్పున భోజనం చేయడానికి వీలుగా నిర్మిస్తున్నారు.

నిధులకోసం దేవాదాయ శాఖకు లెటర్

నిత్యాన్నదాన సత్ర భవనం పూర్తి కావడానికి ఇంకా రూ.2కోట్లు కావాలని అధికారులు చెబుతున్నారు. ఈ నిధుల కోసం ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్‌కు లెటర్ పెట్టారు. నిధులు రాగానే పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

ప్రస్తుతం దీక్షాపరుల మండపంలో అన్నప్రసాదం..

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడానికి తాత్కాలికంగా దీక్షాపరుల మండపాన్ని వినియోగిస్తున్నారు. ఇందులో ఇటీవల వరకు రోజూ 600 మంది భక్తులకు అన్నప్రసాదం అందజేసేవారు. దేవస్థానం ఈఓగా భాస్కర్‌రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం సామర్థ్యం పెంచారు. ప్రస్తుతం 1,000 మందికి భోజనం అందజేస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవనం అందుబాటులోకి వస్తే నిత్యం 5వేల మంది భక్తులకు ప్రయోజనం చేకూరనుంది.



అన్నప్రసాదం పంపిణీకి వినియోగిస్తున్న భవనం

నల్లగొండ, సూర్యాపేట కలెక్టర్లు బదిలీ

- నూతన కలెక్టర్లుగా నారాయణరెడ్డి, తేజస్ నందలాల్ పవార్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా నారాయణరెడ్డి నియమితులయ్యారు. వికారాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డిని నల్లగొండ జిల్లాకు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఆదివారం విధుల్లో చేరనున్నారు. నారాయణరెడ్డి గతంలో నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ పని చేశారు. ప్రస్తుత కలెక్టర్ దాసరి హరిచందన బదిలీపై వెళ్తున్నారు. అలాగే సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు కూడా బదిలీ అయ్యారు. నూతన కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్ రానున్నారు. 2017 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన తేజస్ నందలాల్ పవార్.. మహబూబ్‌నగర్ అసిస్టెంట్, అదనపు కలెక్టర్‌గా, వనపర్తి కలెక్టర్‌గా పనిచేశారు.



నారాయణరెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్



తేజస్ నందలాల్ పవార్, సూర్యాపేట జిల్లా కలెక్టర్

ఇక స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు

భువనగిరి : గెజిటెడ్ హెచ్‌ఎంల పదోన్నతి ప్రకియ ముగియడంతో తాజా ఖాళీలపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేయనున్నారు. వీరిలో 970 మంది ఉపాధ్యాయులు ఉండగా.. మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్న 150 మందికి మినహాయింపు ఇచ్చారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. ఖాళీలతో పాటు సీనియార్టీ ప్రకారం పాయింట్లు కేటాయిస్తారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది జాబితా ప్రకటించనున్నారు. తుది జాబితా ప్రకారం బదిలీల కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోనున్నారు. సీనియార్టీ ప్రకారం అర్హులైన ఎస్‌ఏలకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

నారసింహుడి క్షేత్రంలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి గర్భాలయంలోని మూలవర్యులను హారతితో ఆరాధించారు. అనంతరం నిజాభిషేకం, తులసీ అర్చన నిర్వహించి స్వామివారిని సువర్ణ పుష్పాలతో పూజించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలను పాంచరాత్రాగామ శాస్త్రరీత్యా చేపట్టారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో మంగళ వాయిద్యాల మధ్య ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్య కల్యాణంలో, జోడు సేవల ఊరేగింపులో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నాడు

కోదాడరూరల్ : మండల పరిధిలోని దోరకుంటకు చెందిన పిడుగు వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు అయిన వారు ఎవరూ లేక పోవడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌడం హనుమంతరావు ముందుకు వచ్చారు. శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థికసాయం అందజేసి మృతదేహానికి అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ వైరు అపహరణ

చౌటుప్పల్: మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతుల పొలాల వద్ద శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఆ వైర్లను తీసుకెళ్లి లోపలి భాగంలో ఉన్న కాపర్‌ను తీసుకున్నారు. పైభాగంలో ఉన్న ఖాళీ వైరును అక్కడే పడేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన సమయంలో రైతులు ఈ దొంగతనాలను గుర్తించారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- ముగ్గురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలం వద్ద క్షతగాత్రులు

మద్దిరాల: మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో శనివారం ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలుమల్ల గ్రామానికి చెందిన బెజ్జంకి రాజు, అతని పెద్ద కుమారుడు సాయి తేజ, చిన్న కుమారుడు శివతేజను పోలుమల్ల స్టేజీ వద్ద దింపి రావడానికి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొంసాని శ్రీనివాస్‌రెడ్డి ట్రాక్టర్‌పై పోలుమల్ల స్టేజి నుంచి గ్రామానికి వస్తుండగా.. మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బెజ్జంకి రాజు అతని కుమారులు సాయితేజ, శివతేజలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. పెద్ద కుమారుడు సాయితేజ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈమేరకు బెజ్జంకి రాజు తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు.

నాన్న చూపిన దారిలో..

గుండెలపై ఆడించి గోరు ముద్దలు తినిపించి.. అలకలు భరించి అల్లారు ముద్దుగా లాలించి. చిన్నిచిన్ని పాదాలకు నడకలు నేర్పించి.. ముచ్చటైన ఆశలకు ధైర్యంగా నిలిచి జీవితంలో వెలుగును పరిచయం చేసింది నాన్న. గెలుపుబాట చేరువ చేసే బంధం నాన్న. ఆదివారం 'ఫాదర్స్‌డే' సందర్భంగా పలువురు ప్రముఖులు వారి నాన్నతో ఉన్న అనుబంధాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.



నాన్నే నా రియల్ హీరో..

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి



కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి




ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తండ్రి ధనుంజయ్‌రెడ్డి

కోదాడ : మా నాన్నపేరు ధనుంజయ్‌రెడ్డి. మాది మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల. నాన్న ఐఎఫ్‌ఎస్ అధికారి కావడంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో పని చేశారు. ఎప్పుడూ అడవుల్లో, మరుమూల ప్రాంతాల్లో ఉండేవారు. మేము ముగ్గురం అక్కా చెల్లెళ్లం. నేను పెద్దదాన్ని. మగ పిల్లలు లేకపోయినా ఎలాంటి విక్షత చూపకుండా మమ్ములను మా నాన్న మగపిల్లలతో సమానంగా పెంచారు. ఉన్నత చదువుల కోసం రుషీవ్యాలీలోని జిడ్డు కృష్ణమూర్తి విద్యాలయంలో చదివించాడు. కష్టపడి పని చెయ్యడం, తోటివారికి తోచిన సాయం చెయ్యడం ఆయన నుంచే నేర్చుకున్నాం. కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, గెలిచినపుడు పొంగిపోకుండా స్థిత ప్రజ్ఞతతో ఉండాలని నాన్న ఎప్పుడూ చెపుతుండేవాడు. నా ప్రతి అడుగులో, ప్రతి విజయంలో నాన్నే ఉంటారు. మానాన్నే నాకు స్ఫూర్తి. చివరి వరకు ఆయన చూపిన బాటలోనే నడవాలన్నదే నా ఆశయం. మా నాన్నే నా రియల్ హీరో. ఫాదర్స్‌డే సందర్భంగా ఆయనకు నా మనస్ఫూర్తి శుభాకాంక్షలు.

రాజకీయాలంటే నాన్నకు ఇష్టం లేదు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే తండ్రి ఈశ్వర్‌రెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : కుటుంబ వ్యవస్థలో తండ్రి స్థానం చాలా గొప్పది. మాది పెద్ద కుటుంబం .. మా నాన్న అందరినీ క్రమశిక్షణతో పెంచారు. నాన్న వృత్తిరీత్యా ఉద్యోగి కావడంతో మమ్ములను కూడా ఉన్నత స్థానంలో ఉంచడానికి ఎంతో కృషి చేశారు. రాజకీయాల్లోకి రాకముందు నేను చేసే సామాజిక సేవ మా నాన్నకు బాగా నచ్చింది. ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యాక నేను చేస్తున్న సామాజిక సేవలో భాగస్వామి అయి సూచనలు ఇచ్చేవారు. రాజకీయాల్లోకి వస్తానంటే మా నాన్న వద్దన్నాడు. రాజకీయాలంటే నాన్నకు ఇష్టం లేదు. అందుకే నన్ను రాజకీయాల్లో ప్రోత్సహించలేదు. సామాజిక సేవ చేస్తే ప్రజలకు చిరకాలం గుర్తుండిపోతావనే వారు. మా నాన్న మీద ప్రేమతో 'ఈశ్వరబంధం' అనే కార్యక్రమన్ని తీసుకొచ్చాను. ప్రస్తుతం మానాన్న మాతో లేకున్నా.. ఆయన జ్ఞాపకాలు, ఆయన నేర్పిన క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నా.

మంచి మనిషిగా జీవించాలన్నదే నాన్న కోరిక

- యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే. జెండగే



సాక్షి, యాదాద్రి : నాన్నే నా జీవితంలో మార్గదర్శి. ఆయన చూపిన మార్గంలో నడుస్తున్నాను. చదువుకున్న వ్యక్తిగా నన్ను చదివించారు చదువుతో జీవితంలో ఉన్నతంగా ఎదగాలని చెప్పేవారు. సమాజంలో గుర్తింపు పొందిన మంచి మనిషిగా జీవించాలనేది మా నాన్న కోరిక. చదువు, ఉద్యోగం విషయంలో నాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఏ విషయంలోనూ ఒత్తిడి చేయలేదు. ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన మేరకు చదువుకునేందుకు అవకాశం ఇచ్చారు. బాగా చదువుకోమని చెప్పేవారు. ఐఏఎస్‌గా ఉన్నత స్థితికి చేరుకున్నా. ఎప్పటికప్పుడు నా బాగోగులు అడుగుతారు. ఎప్పుడూ నీకు నచ్చింది చేయమనే స్వేచ్ఛను ఇచ్చారు. ఏ నిర్ణయం తీసుకున్నా మనస్ఫూర్తిగా చేయాలని చెప్పేవారు.

సేవ చేయడం నాన్నను చూసే నేర్చుకున్నా

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



సూర్యాపేటటౌన్ : మా నాన్న రామచంద్రారెడ్డి చిన్నతనం నుంచే సామాజిక సేవలో ముందుండేవారు. మా ఊరు నాగారంలో నాన్న ఆదర్శ రైతు. ఊరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేసేవారు. ఆయనను చూస్తూ పెరిగాను. నాన్న చేసే సామాజిక సేవను చూసి నేను కూడా పది మందికి ఉపయోగపడాలనే పట్టుదలతో చిన్ననాటి నుంచే పీడీఎస్‌యూలో పని చేశాను. ఆ కాలంలో పోలీసులు వచ్చి మీ అబ్బాయి నక్సలైట్లతో తిరుగుతున్నాడని చెప్పినా ఏనాడూ నాన్న నాకు అభ్యంతరం చెప్పలేదు. నా కుమారుడు ప్రజాసేవ కోసం పాటుపడతాడని, ఆ విశ్వాసం నాకు ఉందని పోలీసులకు చెప్పేవారని అమ్మ నాకు చెబుతుండేది. నాన్నకు సూర్యాపేటలో ఎంతో మంది బంధువులు, స్నేహితులు ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో నన్నువెన్ను తట్టి ప్రోత్సహిస్తూ ముందుకు నడిపాడు. ప్రజలకు సేవ చేయడం నాన్నను చూసే నేర్చుకున్నా. ప్రపంచాన్ని మనకు పరిచయం చేసే గొప్ప వ్యక్తి నాన్న.

సంతోష్ బాబు త్యాగం మరువలేనిది



కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లక్ష్మారెడ్డి, సంతోషి తదితరులు

- 31వ బెటాలియన్ అధికారి కల్నల్ లక్ష్మారెడ్డి

సూర్యాపేటటౌన్ : దేశం కోసం కల్నల్ బిక్కుమల్ల సంతోష్ బాబు చేసిన త్యాగం మరువలేనిదని 31వ తెలంగాణ బెటాలియన్ అధికారి కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కల్నల్ సంతోష్‌బాబు వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని సంతోష్ బాబు చౌరస్తా వద్ద సంతోష్ బాబు సతీమణి అదనపు కలెక్టర్ సంతోషి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. దేశం కోసం పోరాటం చేసిన సంతోష్ బాబు పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నేటి యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారిమార్గంలో నడవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ వెంకటేశులు, సుబేదార్ మేజర్ మాధవరావు, రిటైర్డ్ మేజర్ శ్రీనివాసరావు, లచ్చు నాయక్, చంద్రయ్య, నాగులు, పాలకుర్తి శేషగిరి రావు, తల్లిదండ్రులు బిక్కుమల్ల మంజుల, ఉపేందర్, తల్లాడ వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న అర్చకులు, ఆలయ సిబ్బంది, తాత్కాలిక ఉత్సవ కమిటీ సభ్యులు

- కొనసాగుతున్న దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు
- నేడు అమ్మవారి కల్యాణం
- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి దంపతులు

కనగల్: దర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ, బాలబోగ నివేదన, విఘ్నేశ్వరపూజ, ఎదుర్కోలు మహోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10.30గంటలకు అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య తెలిపారు. వేడుకలకు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సబిత దంపతులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి వారు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అమ్మవారి కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. కల్యాణ అనంతరం అన్నదానం కార్యక్రమంతో పాటు సాయంత్రం అమ్మవారి విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, శ్రవణ్‌కుమారాచార్యులు, సుదర్శనాచార్యులు, గాదె మహేష్, దామోదర్, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద సెంట్రల్ లైటింగ్

దర్వేశిపురం ఆలయం వద్ద ఇప్పటికే రెండు వరుసల రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌తో ఆలయం నూతన శోభ సంతరించుకుంది.

రెగ్యులర్ కమిటీ ఉండగానే..

ఆలయానికి రెగ్యులర్ కమిటీ ఉండగానే తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో భక్తులు, దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ఓ గ్రామానికి చెందిన కీలక నేత వ్యవహారంతోనే నడిపించినట్లు సమాచారం. ఉత్సవాలను రెగ్యులర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తే తాము దూరంగా ఉంటామని తేల్చిచెప్పడంతో చేసేదేమి లేక తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

గంజాయి తాగుతున్న 11 మంది యువకులు అరెస్ట్

కోదాడరూరల్: గంజాయి తాగుతున్న 11 మంది యువకులను కోదాడ ఎక్సైజ్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. కోదాడ పట్టణంలోని పలు సెంటర్‌లలో కొందరు యువకులు గత కొద్ది రోజులుగా గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు న్యూవిజన్ స్కూల్ వెనుక, కొమరబండ శివారులో దాడులు నిర్వహించారు. రెండు ఆటోల్లో 11 మంది యువకులు గంజాయి తాగుతుండగా వారిని పట్టుకున్నారు. వారి నుంచి నాలుగున్నర కేజీల గంజాయి, రెండు ఆటోలు, ఐదు ద్విచక్రవాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఏపీలోని పీలేరు, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో తక్కువ రేటుకు తీసుకొచ్చి కొంత సేవించి, మరికొంత గంజాయిని విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, టూ టౌన్ ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న మారెండ్ల సైదులు(32) భార్య నెల రోజుల క్రితం చిన్న ఆపరేషన్ చేయించుకునేందుకుగాను తన పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో కుటుంబంలో నెల కొన్న గొడవలతో మనస్పర్థలు వచ్చాయి. మనస్తాపం చెందిన సైదులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు సేకరించారు. మృతుడికి భార్య సుకన్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ రంగారెడ్డి

మర్రిగూడ: మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఎస్‌ఐ రంగారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించిన పోలీసులు గ్రామానికి చెందిన పెంబల్ల భరత్ వద్ద 20 లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుకుని సీజ్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయన వెంట సిబ్బంది వాహీద్, శ్రీనివాసులు, సైదులు, యాదగిరి, రమేష్, సత్యనారాయణలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి



లింగయ్య మృతదేహం

నూతనకల్లు: తాటి పైనుంచి పడిన గీత కార్మికుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతుండగా శనివారం మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బింగి లింగయ్య(48) మార్చి 30న తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించి చికిత్స అందించారు. వైద్యుల సలహా మేరకు లింగయ్యను ఇంటికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. శనివారం విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతుండడంతో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న 8 మోటార్లు శుక్రవారం రాత్రి సమయంలో చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై రైతులు యరగాని గురుస్వామి, మాడుగల పరుశురాం శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్ల, రఘునాథపాలెం గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల వ్యవసాయ భూముల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి అందులోని కాపర్‌వైరు, విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. ఈ విషయమై రైతులు ఆందోళన నిర్వహించడంతో విద్యుత్ ఏఈ హరీష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంమాంజనేయులు తెలిపారు.

చౌటుప్పల్, ఆలేరులో దొంగల బీభత్సం

- దండుమల్కాపురంలోని ఓ ఇంటిలో 30తులాల బంగారం, 1.50లక్షల నగదు చోరీ
- ఆలేరులో మూడు ఇళ్లలో చోరీ

చౌటుప్పల్: చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంతోపాటు, ఆలేరు మున్సిపాలిటీలోని రాం శివాజీ నగర్, శాంతి నగర్ కాలనీల్లో తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దండుమల్కాపురం గ్రామానికి చెందిన సిద్దిపేట వెంకట్‌రెడ్డి-కవిత దంపతులు రైతువేదిక సమీపంలో నివాసం ఉంటున్నారు. కుటుంబసభ్యులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా.. డోర్‌కు వేసిన తాళం తీసి ఉంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా.. బీరువా తలుపు పగులగొట్టి ఉంది. అందులో దాచిన 30తులాల బంగారు నగలు, రూ.1.50లక్షల నగదు కనిపించ లేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అశోక్‌రెడ్డి అక్కడకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.



దండుమల్కాపురంలో తెరిచి ఉంచిన బీరువా

ఆలేరు మున్సిపాలిటీలో..

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు పట్టణంలోని రాం శివాజీనగర్, శాంతి నగర్‌లో నివాసం ఉంటున్న కొడ చంద్రయ్య ఇంటిలో తులంన్నర బంగారం, 60 తులాల వెండి, అబ్బ సాయిలు ఇంటిలో రూ.లక్ష నగదు, దుకాణదారుడు సంతోష్ ఇంటిలో రూ.35వేల నగదు చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో ఇంటికి తాళాలు వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడ్డారు. బాధితులు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.



ఆలేరులో చోరీ జరిగిన ఇంటిలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖను సమీక్షించి కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు ప్రకటించాలని, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డబ్బీకార్ మల్లేష్, ఎండీ.సలీం, ప్రమీల, దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతంరెడ్డి, చింతపల్లి బయ్యన్న, ఏర్పుల యాదయ్య, కానుగు లింగస్వామి, బాణాల పరిపూర్ణచారి, తిరుపతి రామ్మూర్తి, జిట్ట నగేష్, అద్దంకి నరసింహ, గురవయ్య, గణేష్, భూలక్ష్మి, సులోచన, యాదయ్య, బక్కయ్య, నగేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

భువనగిరిటౌన్ : సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి సీట్లు తగ్గడానికి ఆ పార్టీ అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలే కారణమన్నారు. రాజ్యాంగాన్ని మార్చడానికి పూనుకున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన విధంగా తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. రైతు రుణమాఫీని ఆగస్టులో కాకుండా ఇప్పుడే చేయాలని కోరారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారుకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ, సిరిపంగ స్వామి, సైదులు, బూరుగు కృష్ణారెడ్డి, పొలగాని జయరాములు, దయ్యాల నరసింహ, ఎండీ పాషా, శ్రీనివాస చారి, ఏక్బాల్ వెంకన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



లక్ష్మణ్ మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు పట్టణంలోని బైపాస్ సమీపంలో వరంగల్- హైదరాబాద్ హైవేపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన రంగ లక్ష్మణ్ (40) రాజాపేట నుంచి యాదగిరిగుట్ట పెద్దకందుకూరు గ్రామంలో ఉన్న తన కుమార్తె వద్దకు సాయంత్రం వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి ఆలేరు పట్టణానికి వెళ్తున్న క్రమంలో ఆలేరు బైపాస్ సమీపంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు, లక్ష్మణ్ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.